ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

బుధవారం 5 నవంబరు 2025

సముద్ర స్నానాలు నిషేధం

నేడు కార్తిక పౌర్ణమికి భక్తులకు అనుమతి లేదు



8

సత్య సాయిబాబా భక్తులకు శుభవార్త

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆ రైళ్లు గుంటూరు, నరసరావుపేటలో నిలుపుదల

6



ఎద్దువాగులో రహదారి కొట్టుకుపోయి మిగిలిన సిమెంట్ పైపులు

వంతెన లేక వెతలు

- అర కిలోమీటర్‌కు 15 కిమీ దూరాబారం
- హైలెవల్ వంతెన నిర్మించాలని రైతుల అభ్యర్థన

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆ వాగుపై వంతెన లేదు. దీంతో వర్షాల సమయంలో అర కిలోమీటరు దూరానికి 15 కిలోమీటర్లు ప్రయాణించి పొలాలకు వెళ్లాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మునగోడు గ్రామ సమీపంలోని ఎద్దువాగుపై వంతెన లేదు. గ్రామానికి చెందిన రైతులకు సంబంధించి వాగు దాటిన తర్వాత సుమారు 600 ఎకరాల సాగుభూములు ఉన్నాయి. ఈ పొలాలకు రైతులు వెళ్లే వీలు లేకుండా ఎద్దువాగు ప్రవహిస్తోంది. వాగుపై గతంలో ఇసుక రీచ్ నిర్వాహకులు సిమెంట్ పైపులు వేసి గ్రావెల్ రోడ్డు నిర్మించారు. దీంతో రైతులు పొలాలకు ఆ మార్గంలో వెళ్లి సాగు పనులు చేసుకుంటూ ఉన్నారు. అయితే ఇటీవల వచ్చిన వరదలకు సిమెంట్ పైపులపై ఉన్న గ్రావెల్ కంకర కొట్టుకుపోయింది. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుతం రైతులు మునగోడు నుంచి బయ్యవరం, ఊటుకూరు, కస్తల మీదగా సుమారు 15కి.మీ ప్రయాణించి పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. పొలాలకు ఎరువులు తీసుకెళ్లాలన్నా, పండించిన పంటలను ఇంటికి తీసుకురావాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించి ఎద్దువాగుపై హైలెవల్ వంతెన నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని మునగోడు గ్రామ రైతులు అభ్యర్థిస్తున్నారు.

19 నుంచి వీరుల ఉత్సవాలు

విజయవంతం చేయాలి : ఆర్డీవో మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి కారంపూడిలో వీరుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. వీరుల ఉత్సవాలపై మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఐదు రోజులు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చూడాలన్నారు. పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శ్రీసిమెంట్స్, శ్రీచక్ర సిమెంట్స్ యాజమాన్యం ఉత్సవాల్లో భాగస్వాములై అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవఅయ్యవారు, ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, కారంపూడి తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కసిన్యానాయక్, పీఠం నిర్వాహకులు బొగ్గవరపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అందరికీ ఎన్టీఆర్ ట్రస్ట్

వైద్యం అందాలి

- సిబ్బందికి జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆదేశాలు

క్రోసూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సేవలు ప్రజలందరికీ అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ గుడిసె చంద్రశేఖర్ ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు విధానాన్ని స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డుల ఆన్‌లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయా లన్నారు. ఎన్‌సీడీసీడీ సర్వేను వంద శాతం పూర్తి చేయాలన్నారు. 104 వాహన సేవలు ప్రజలకు పూర్తిగా వినియోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసే ఉచిత వైద్య సేవల గురించి సిబ్బంది వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు జాఫ్రిన్, మహమ్మద్ షాద్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సూపర్ వైజర్ శిశుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

కొనుగోళ్లు.. కంటితుడుపే

బర్లీ పొగాకు రైతులకు అన్యాయం జరగదు.. చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం.. అని ఒకవైపు ప్రభుత్వం చెప్తోంది. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయని రైతులు వాపోతున్నారు. బర్లీ రైతులను గట్టెక్కించాలని ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించగా.. నెలల తరబడి కొనుగోళ్ల ప్రక్రియను సాగదీస్తోంది. ఇప్పటికి రెండు విడతలుగా గడువు పొడిగించినా కొనుగోళ్లు ప్రక్రియ కంటితుడుపుగానే సాగుతోంది. దీంతో పొగాకు దిగుబడులను అటు నిల్వ చేసుకోలేక.. ఇటు ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక రైతులు అల్లాడుతున్నారు. ఇదే సమయంలో ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు బర్లీ రైతులను ముంచేశాయి. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. కొనుగోళ్లకు సంబంధించి మార్క్‌ఫెడ్ దాగుడుమూతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకుపై మార్క్‌ఫెడ్ దాగుడు మూతలు

- గడువు పెంపుతో సరి.. కొనుగోళ్లు నామమాత్రం
- మొంథా తుఫాన్‌తో బర్లీ రైతు మరింతగా కుదేలు
- 20,000 క్వింటాళ్లకు అనుమతివ్వాలని తాజాగా ప్రతిపాదనలు



పర్చూరు : ఉప్పుటూరులో తడిచిన పొగాకును ఆరబెడుతున్న రైతులు

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

జూన్ చివరి వారంలో బర్లీ కొనుగోళ్లను చేపట్టిన మార్క్‌ఫెడ్, సెప్టెంబరు చివరి వరకు సేకరణ జరుపుతామని తొలుత ప్రకటించింది. ఆ గడువు ముగిసే నాటికి గుంటూరు,బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో 2,08,510 క్వింటాళ్ల బర్లీని కొనుగోలు చేసినట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. రైతుల (మిగతా 6వ పేజీలో)

50 వేల క్వింటాళ్లకు 9 వేలు

నాలుగు జిల్లాల పరిధిలోని రైతుల దగ్గర బర్లీ నిల్వలు ఇంకా 50,000 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. రెండు దఫాలుగా గడువు పొడిగించిన సమయంలో 25,000 క్వింటాళ్ల కొనుగోళ్లు జరపాల్సి ఉంది. అయితే గడవు ముగిసేప్పటికి 9,000 క్వింటాళ్లతోనే సరిపెట్టింది. అయితే షెడ్యూల్ ఇచ్చినా రాకపోవడం వల్లే కొనుగోళ్లు అంతగా జరగలేదని మార్క్‌ఫెడ్ ప్రకటనపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కోసం కృషి చేస్తా

జేఎన్టీయూ సందర్శనలో కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట సమీపంలోని జేఎన్టీయూ కళాశాల అభివృద్ధికి యూనివర్సిటీ నుంచి నిధులు మంజూరు కోసం కృషి చేస్తానని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలెక్టర్ కలసి మంగళవారం కళాశాలను సందర్శించారు. జేఎన్టీయూ కాకినాడ వీసీతో కళాశాల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కళాశాలలో జరుగుతున్న ప్రగతి పనులపై చర్చించారు. వసతిగృహాలకు సంబంధించి నిధులు మంజూరు చేస్తే నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకానికి అనుమతులు కోసం ప్రయత్నిస్తామన్నారు. ప్రధాన రహదారి వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ఎంపీడీవోను ఆదేశించారు. నరసరావుపేట నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థుల కోసం రెండు బస్సులు ఉండగా మరో సర్వీసును ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసరావు, ఆర్డీవో మధులత, అధ్యాపకులు పాల్గొన్నారు.



కళాశాలలో పర్యటిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

చేతులు కాల్చుకున్న కూటమి నేతలు!

కూటమి క్యాడర్ ప్రగతి పనులు చేసి చేతులు కాల్చుకుంది. బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో వారు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. నెలల తరబడి చేసిన పనుల సొమ్ముల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పల్లె పండుగ పథకం కింద..ఉపాధి హామీ పథకం నిధులతో రహదారులు, మురుగు కాల్వల పనులు విస్తృతంగా జరిగాయి. అలాగే గుంతల రహితంగా రహదారులను తీర్చి దిద్దామని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఈ పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించడాన్ని విస్మరించింది. అటు పల్లె పండుగ, ఇటు రహదారుల గుంతలు పూడ్చివేత పనులు చేసిన కూటమి నేతలు, కార్యకర్తలు అప్పులకు వడ్డీ పెరుగుతుండటంతో గుడ్లు తేలేస్తున్నారు. బిల్లులు ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నా ప్రయోజనం లేదని బాధితులు చెబుతున్నారు. జిల్లాలో రూ.76 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ పైసలు ఇప్పట్లో విడుదలయ్యే పరిస్థితులు కానరావడం లేదు.

పేరుకుపోయిన పల్లె పండుగ పనుల బకాయి

- రోడ్లపై గుంతలు పూడ్చినా.. పైసా అందని వైనం
- అప్పుల ఊబిలో ద్వితీయ శ్రేణి నేతలు
- కళ్లుకాయలు కాసేలా బిల్లుల కోసం ఎదురు చూపులు



రహదారులపై గుంతలు పూడ్చివేత (పాత చిత్రం)

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రగతి పనుల అంశంలో 2014 - 2019 నాటి పరిస్థితులు పునరావృతం అయ్యాయి. ఈ కాలంలో బిల్లులు విడుదల కాక టీడీపీ నేతలు అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేని విధంగా నష్టపోయారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం ఆ బిల్లుల చెల్లింపును నిలిపివేయడంతో వారు కోర్టులను ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం రావడంతో పాత బిల్లులు చెల్లిస్తారని ఆశపడ్డారు. పాత బిల్లుల మాట ఎలా ఉన్నా కొత్తగా చేసిన పనులకు సొమ్ములు చెల్లించకపోవడంతో వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ పనులను కూటమి క్యాడర్ పెద్ద ఎత్తున చేసింది. రహదారుల గుంతలు పూడ్చే పనులను సబ్ కాంట్రాక్టర్లగా నేతలు చేశారు. గ్రామ స్థాయిలో పనులు చేసిన వారిలో మండల, గ్రామ స్థాయి నాయకులు ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేసిన నేతల్లో కొందరు మళ్లీ పనులు చేశారు. అప్పుడు, ఇప్పుడు బిల్లులు (మిగతా 6వ పేజీలో)



పల్లెపండుగలో నిర్మించిన సీసీ రోడ్డు (పాత చిత్రం)



పేరు మార్చారు.. పనులు మరిచారు

- కొలిక్కిరాని 'మన బడి మన భవిష్యత్' నిర్మాణాలు
- 18 నెలలుగా పాఠశాలల్లో ఎక్కడి నిర్మాణాలు అక్కడే
- రూ.400 కోట్ల పనులు పెండింగ్.. వేధిస్తున్న గదుల కొరత

వినుకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు అంటూ పాఠశాలల్లో భవన నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేసింది. కూటమి ప్రభుత్వం నాడు నేడు పేరును 'మన బడి మన భవిష్యత్' అని మార్చింది. అయితే పేరు మార్చిన ప్రభు త్వం 18 నెలలుగా పాఠశాలల్లో పనులను పట్టించుకోలేదు. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని అనేక పాఠశాలల్లో తరగతి గదుల సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వరండాల్లో, చెట్ల కింద బోధనలతో ఉపాధ్యాయులు సరిపెడుతున్నారు. వర్షాలు, ఎండల సమయాల్లో వారి ఇబ్బందులు చెప్పనలవికాకుండా ఉంటున్నాయి. అయినా అధికారులు, పాలకులు అసంపూర్తి నిర్మాణాలపై దృష్టి సారించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో తరగతి గదులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు మదన పడుతున్నారు. నాడు నేడు పేరుతో గత ప్రభుత్వం రెండు దశల్లో రూ.600 కోట్లకుపైగా నిధులు వెచ్చించి పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టింది. ఐదేళ్ల పనులు సక్రమంగా జరగలేదు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.400 కోట్లకుపైగా నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దాదాపు 450పైగా ఉన్నత పాఠశాలల్లో 70శాతానికిపైగా నిర్మాణాలు జరిగాయి. అయితే వాటికి ప్రస్తుత ప్రభుత్వం నిధులు (మిగతా 6వ పేజీలో)

ట్రైబల్ స్కూల్‌కు ప్రథమ స్థానం

ముగిసిన సైన్స్ డ్రామా పోటీలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో ఎత్తిపోతలలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. స్థానిక శంకరభారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలు మంగళవారంతో ముగిశాయి. పోటీలకు జిల్లావ్యాప్తంగా 80 మంది విద్యార్థులు హాజరు కాగా చల్లగుండ్లలోని జడ్పీ, తృతీయస్థానం యల్లమందలోని జడ్పీ ఉన్నత పాఠశాల కైవసం చేసుకున్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఎస్‌వో రాజశేఖర్ తెలిపారు.

ఎస్ఐఐఎస్‌డీసీ - 2025 పోటీలు..

విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ మ్యూజియం, బెంగళూరు ఆధ్వర్యంలో దక్షిణ భారత సైన్స్ డ్రామా కాంటెస్ట్ - 2025 సైన్స్ డ్రామా పోటీలకు 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు అర్హులని డీఈవో చంద్రకళ ఓ ప్రకటనలో తెలిపారు. సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎలా ఉపయోగపడుతుందనేది ప్రధాన అంశంగా ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. ఉప అంశాలుగా సైన్స్‌లో స్త్రీ పాత్ర, వ్యవసాయంలో ఆధునికత, డిజిటల్ ఇండియాతో జీవితాలలో స్వావలంబన, అందరికీ పరిశుభ్రత, గ్రీన్ టెక్నాలజీస్ ఉంటాయని ఆమె చెప్పారు.



సైన్స్ డ్రామాలో విద్యార్థుల ప్రదర్శన

అమెరికాకు.. పల్నాడు చిన్నారి

● జిల్లాలో మొదటి విదేశీ దత్తత ● అమెరికన్లతో మాట్లాడిన కలెక్టర్


చిన్నారి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్న అమర ప్రగతి అనే ఏడాది వయస్సున్న పాపను అమెరికాలోని ఇల్లినోయిస్‌కు చెందిన బ్రాడెన్ రీజ్ వెబ్ దత్తత తీసుకున్నారు. ఇందుకు కేరింగ్ పోర్టల్‌లో వారు దరఖాస్తు చేసుకుని.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా అనుమతి పొందారు. దత్తత తల్లిదండ్రులతో ఆన్‌లైన్‌లో కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతురాలైన పాపను దత్తత తీసుకోవడంలో.. వారి అభిప్రాయం, సంసిద్ధత గురించి తెలుసుకున్నారు. జన్మనిచ్చిన బిడ్డతో సమానంగా పాపపై శ్రద్ధ చూపాలని కోరారు. దత్తత తల్లిదండ్రులు కూడా పాప విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. చిన్నారికి చికిత్స కూడా అందిస్తామని చెప్పారు. ఇది పల్నాడు జిల్లా ఏర్పాటు అయిన తర్వాత మొదటి(ఇంటర్ కంట్రీ అడాప్షన్)విదేశీ దత్తత.

9న బీసీ సంక్షేమ సంఘం విస్తృత సమావేశం

● రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీసీలకు రక్షణ చట్టంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఓబీసీ కులగణన పూర్తి చేయాలన్న డిమాండ్‌లపై ఈ నెల 9న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జనగణనతో పాటే సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించి, ఆపై జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం బీసీల అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలైన చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరపాలన్నా, ముందుగా కుల గణన చేయడం తప్పనిసరన్నారు. బీసీ రిజర్వేషన్లలో కూడా అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరగాలంటే ఏబీసీడీలుగా వర్గీకరించాల్సి ఉందన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి,ఈ మేరకు బడ్జెట్లో కేటాయింపులు జరిపి ప్రత్యేక నోడల్ ఏజెన్సీ ద్వారా సక్రమంగా అమలు జరపాలన్నారు. విజయవాడలో జరిగే సంఘ విస్తృత సమావేశానికి అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నేతలు కన్నా మాస్టర్, పారేపల్లి మహేష్, కోలా అశోక్, కోలా మణికంఠ, భాస్కర్ తదితరులున్నారు.

ఘన వారసత్వ బాధ్యత మీదే

● జింకానా అధ్యక్షుడు రామకోటేశ్వరరావు ● వైద్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు


ప్రసంగిస్తున్న జింకానా అధ్యక్షుడు కోయ రామకోటేశ్వరరావు

గుంటూరు మెడికల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖండాంతర ఖ్యాతి గాంచిన గుంటూరు వైద్య కళాశాల ఘనమైన వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత నేటి తరం వైద్య విద్యార్థులపై ఉందని గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) అధ్యక్షుడు, హిమటాలజిస్ట్ డాక్టర్ కోయ రామ కోటేశ్వర రావు పిలుపునిచ్చారు. ఎందరో గొప్ప వైద్యులను సమాజానికి అందించిన గుంటూరు వైద్య కళాశాలలో మెడిసిన్ చదవడం అదృష్టంగా భావించాలని ఆయన ఉద్బోధించారు. మంగళవారం వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన 2025వ బ్యాచ్ మెడిసిన్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే ఇగ్నైటో -25 వేడుక, వైట్ కోట్ సెర్మనీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా ఆయా ప్రాంతాల్లో తెలుగు వైద్యులు, ముఖ్యంగా గుంటూరు వైద్య కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు కనిపిస్తారని డాక్టర్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఇదే రీతిలో ప్రస్తుత విద్యార్థులు కూడా చక్కటి వైద్యులుగా ఎదిగి జీవితంలో ఉన్నత స్థాయి చేరాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరా చారీ మాట్లాడుతూ రోగుల పట్ల సానుభూతితో, ప్రేమతో వ్యవహరించాలని విద్యార్థులను కోరారు. నేడు వైద్యుడికి, రోగి మధ్య డబ్బులు, వైద్య పరికరాలు అడ్డంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ వైద్యుడుగా ఎదగటం గొప్ప కాదని, మంచి వైద్యుడు గా గుర్తింపు పొందడం కష్టమన్నారు. అనంతరం జింకానా వితరణతో.. ఈ బ్యాచ్‌కు చెందిన 250 మంది వైద్య విద్యార్థులకు యాప్రాన్ (తెల్లకోటు), ఐడీ కార్డులను అందజేశారు. వైద్య వృత్తి ధర్మానికి కట్టుబడి ఉంటామని ప్రిన్సిపాల్ సుందరాచారీ, విద్యార్థుల తో హిప్పోక్రాటిక్ ఓత్ చేయించారు. అనంతరం వైద్యులు, వైద్య విద్యా ర్థులకు జింకానా అవార్డులను ప్రదానం చేశారు. డాక్టర్ తుమ్మల రామబ్రహ్మం రీసెర్చ్ అవార్డు కింద ప్రభుత్వాస్పత్రి, వైద్య కళాశాల ల్లో వివిధ విభాగాల్లో వైద్య పరిశోధనలు చేసి పరిశోధన పత్రాలను వెలువరించిన డాక్టర్ సుమిత శంకర్ (ప్లాస్టిక్ సర్జరీ), డాక్టర్ కాత్యాయిని (మైక్రోబయాలజీ), డాక్టర్ రు.లక్ష్మీ (డెర్మటాలజీ), డాక్టర్ సాయికిరణ్ (సైకియాట్రి), డాక్టర్ ఎల్జే సంధ్యావళికి (ఆప్తమాలజీ) రీసెర్చ్ అవార్డులను అందజేశారు. పలువురికి పలు మెరిట్ అవార్డుల ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బి.శ్రీధర్ (అడ్మినిస్ట్రేషన్), డాక్టర్ బి.మాధవి (అకడమిక్), జింకానా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.బాల భాస్కరరావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు, కరణం రాజారావు, పలు విభాగాధిపతులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

విజయపురిసౌత్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత శుక్రవారం మాచర్ల మండలం చింతలతండా వద్ద గొర్రెల కాపరి జగ్గప్పల సాయిపై రాయితో దాడి చేసి... హత్య చేసి పరారైన రమావత్ బుడ్డానాయక్‌ను మంగళవారం విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ అరెస్ట్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. అలాగే గత సోమవారం హస్నాబాద్ తండాలో నాటుసారా కాస్తున్న నిందితుడు బాలు నాయక్ కూడా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్‌ఐ అశోక్ ఈ సందర్భంగా తెలిపారు.

పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు ఆకాంక్షించారు. వర్సిటీలో కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ అడవి తక్కెళ్లపాడు గ్రామం సుందరయ్య కాలనీలోని 45 మంది మహిళలకు ఫినాయిల్, పెయిన్ బామ్, డిటర్జెంట్ తయారీపై ఒక రోజు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ శిబిరాలను మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు. సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.బబిత అధ్యక్షత వహించారు. కార్పొరేటర్ స్మిత పద్మజా, సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.వెంకటరమణ, సుందరయ్య కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు భార్గవి, శిక్షకురాలు ఎం.విజయలక్ష్మి, ఆచార్య పి.శంకర పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో హోమ్ నీడ్స్‌పై ఉచిత శిక్షణ

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

ఏఎన్‌యూలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చివరి సంవత్సర విద్యార్థుల కళా నైపుణ్యాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం విద్యార్థుల చిత్ర కళా ప్రదర్శనను ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ కె.గంగాధర రావు, జి.సింహాచలం ప్రారంభించారు. ఆచార్య ఎం. సురేష్ కుమార్ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థుల కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఆర్కిటెక్చర్ విభాగాధిపతి నిరుపమ, పలువురు ఆచార్యులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు జి.అనిల్ మనోహర్, సీహెచ్. హెలీనా, ఎం.సునీత, పి.సాగరిక, డి.నితిన్ ప్రైస్, ఎం.గణేష్ చిత్ర ప్రదర్శనలు ప్రశంసలు అందుకున్నాయి. ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు విద్యార్థుల చిత్ర కళా ఎగ్జిబిషన్ ఉంటుంది.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ ఈ ఏడాది నిర్వహించిన ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంకామ్ రెండవ సెమిస్టర్, బీఈడీ నాలుగు, మొదటి, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, నానో టెక్నాలజీ నాలుగు, ఆరవ సెమిస్టర్లు, రీవాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను మంగళవారం శివప్రసాద్‌రావు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందు పరిచామన్నారు.

రైతుల పేరుతో జగన్ నాటకాలు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమానికి మంగళం పాడి నేడు జగన్ రాజకీయ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం విమర్శించారు. రైతులు నష్టపోయారని గొంతు చించుకుంటున్న జగన్ ముందు తన ప్రభుత్వ హయాంలో సంభవించిన విపత్తుల నష్టానికి ఎంతమేర రైతులకు సాయం చేశారు.. ఎన్ని కుటుంబాలను ఆదుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను ఆందోళనకు గురిచేసి, వారిని రెచ్చగొట్టాలన్నదే జగన్ కుట్రపూరిత ఆలోచన అని పేర్కొన్నారు. తుపాన్ల నష్టం కంటే పరామర్శల పేరుతో జగనే ఎక్కువ నష్టం చేస్తున్నారంటూ రైతులు వాపోతున్నారని దుయ్యబట్టారు. ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పెట్టించలేని నాయకుడు తమకేం మేలు చేస్తాడని అభిప్రాయపడుతున్నదని తెలిపారు.

చేతులు కాల్చుకున్న కూటమి నేతలు!

(5వ పేజీ తరువాయి)

నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిలిచినా రామంటున్నారు..

ప్రగతి పనుల టెండర్లు దక్కించుకోవాలంటే గతంలో విపరీతమైన పోటీ ఉండేది. అది నామినేటెడ్ ప్రాతిపదికన చేపట్టే పనులంటే పైరవీలు పెద్ద ఎత్తున జరగాల్సిందే. అలాంటిది బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పనులు ఇస్తాం తీసుకోండి అన్నా ఎవరూ ముందుకు రాని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి.

భారీగా బకాయి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పల్లె పండుగ రూ.72.5 కోట్ల విలువైన పనులు చేశారు. ఇందులో రూ.26 కోట్లు చెల్లింపులు మాత్రమే జరిగాయి. ఇంకా రూ.46.5 కోట్ల బకాయి ఉంది. జనవరి తర్వాత ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని బాధితులు చెబుతున్నారు. రహదారులపై గుంతల పూడ్చే పనులను.. కాంట్రాక్టర్ల వద్ద కూటమి నేతలు సబ్ కాంట్రాక్టర్లుగా చేశారు. జిల్లాలో రెండు విడతల్లో రూ.29.55 కోట్ల పనులు చేశారు. నేటి వరకు చేసిన పనులకు రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పేరు మార్చారు.. పనులు మరిచారు..

(5వ పేజీ తరువాయి)

చెల్లించలేదు. ఆయా భవనాలు పూర్తి అయితే తరగతి గదుల కొరత తీరుతుందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. గుంటూరులోని ఏటి అగ్రహారం, పట్టాభిపురం, కేవీపీ కాలనీ, ఎన్జీవో కాలనీతోపాటు మండల పరిధిలోని లాలుపురం, నల్లపాడు, ఓబులునాయుడుపాలెం, వెంగళాయపాలెం, అంకిరెడ్డిపాలెం, ఏటుకూరు గ్రామాలతో పాటు పల్నాడు, బాపట్ల జిల్లాలో కూడా అనేక పాఠశాలల్లో అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి.

కొలిక్కిరాని విచారణ

గత ప్రభుత్వం నాడునేడు పేరుతో తల్లిదండ్రుల కమిటీలకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. పేరుకు తల్లిదండ్రుల కమిటీ ఉన్నా దాని వెనుక మాత్రం వైసీపీ అనుచరగణమే ఉంటూ నిర్మాణాలు చేపట్టింది. నాణ్యతా లోపంతోపాటు నిర్మాణాల విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఆయా పనులపై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఈ విచారణ ఎంతవరకు వచ్చిందో కూడా అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు.

కొనుగోళ్లు.. కంటితుడుపే

(5వ పేజీ తరువాయి)

విజ్ఞప్తుల మేరకు అక్టోబరు 15 వరకు కొనుగోళ్లు చేపడతామని మార్క్‌ఫెడ్ తెలిపింది. తర్వాత ఆ గడువును మరో పది రోజులు పొడిగించి గత నెల 25 వరకు కేంద్రాల ద్వారా బర్లీ సేకరణ జరుపుతామని అధికారులు ప్రకటించారు. అయితే గడువు పెంపుకాలంలో నాలుగు జిల్లాల పరిధిలో మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా బర్లీ సేకరణ చేపట్టామని యంత్రాంగం చెబుతోంది. కానీ ఇవన్నీ ఉత్తమాటలేనని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియజేస్తున్నాయి. తాజాగా విరుచుకుపడిన భారీ వర్షం ధాటికి బర్లీ పొగాకు బేళ్ల కిందకు వాన నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడంతో రైతుల ఆవేదనకు అంతేలేకుండా పోయింది. బర్లీ కొనుగోళ్లకు సంబంధించి 16,739 మంది రైతులు నమోదు చేసుకుంటే కేంద్రాలు మూసివేసే నాటికి 11,985 మంది రైతుల నుంచే బర్లీ కొనుగోలు చేశారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.136 కోట్ల మిగులు ఉన్నట్లు అధికారికంగానే తెలుస్తోంది. బర్లీ కొనుగోళ్లకు రూ.273 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఇప్పటి వరకు జరిపిన కొనుగోళ్లకు సంబంధించి రూ.102 కోట్లు చెల్లించగా, ఇంకా రూ.35 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

ఆదుకుంటామని మంత్రుల హామీ..

తుఫాన్ నష్టాన్ని పరిశీలించడానికి మంత్రులు పార్థసారథి, రవికుమార్‌లతో పాటు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిపిన క్షేత్రస్థాయిలో పర్యటనలో తమ ఇక్కట్లను బర్లీ రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రాల ద్వారా బర్లీ కొనకపోతే తాము నిండా మునగడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేయగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దీనినిబట్టి రైతుల వద్ద ఇంకా పెద్దఎత్తున బర్లీ నిల్వలు ఉన్నాయని ప్రత్యక్షంగా తెలుస్తోంది. కానీ కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ పొంతనలేని సమాధానాలు చెప్పడం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసమేనని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది


మంత్రుల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు(ఫైల్ ఫొటో)

తాజా ప్రతిపాదనలు..

20,000 క్వింటాళ్ల బర్లీ పొగాకు సేకరణకు అనుమతివ్వాలనే ప్రతిపాదనలను అధికారులు ఈ నెల 1న మార్క్‌ఫెడ్‌కు పంపినట్లు సమాచారం. అక్టోబరు 25తో కేంద్రాలను మూసేసిన సంగతి తెలిసిందే. గడువు పెంచి 9,000 క్వింటాళ్లలోపుతో సరిపెట్టిన మార్క్‌ఫెడ్, ఇప్పుడు అదనంగా ప్రతిపాదనలు పంపడంపై రైతుల్లో నమ్మకం కుదరడం లేదు.

సత్య సాయిబాబా భక్తులకు శుభవార్త

● ఆ రైళ్లు గుంటూరు, నరసరావుపేటలో నిలుపుదల

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈస్టుకోస్టు రైల్వే ప్రకటించిన ప్రత్యేక రైళ్లన్నింటికి గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు స్టేషన్లలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పించింది. తొలుత ప్రకటించిన ఈ రైళ్ల టైంటేబుల్‌లో గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డుకు హాల్టింగ్ ఇవ్వలేదు. దీనిపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో గుంటూరులో సాయి భక్తులు లేరా అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఇదే విషయాన్ని గుంటూరు రైల్వే యూజర్స్ అసోసియేషన్ దక్షిణ మధ్య రైల్వేకు నివేదించింది. దీనిపై ఎస్‌సీఆర్ స్పందించి ఈస్టుకోస్టు రైల్వేకు లేఖ రాయడంతో వెనువెంటనే హాల్టింగ్ కల్పిస్తూ కొత్త టైంటేబుల్‌ని ప్రకటించింది. ఈ మేరకు ఈస్టుకోస్టు రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ దిబ్యన్‌జన్‌రాయ్ మంగళవారం సాయంత్రం సమాచారం ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● అరకు - యల్హాంక స్పెషల్స్‌కు నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో నిలుపుదల కల్పించింది.

● శ్రీకాకుళం రోడ్డు - బెంగుళూరు స్పెషల్స్‌కు గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో హాల్టింగ్ ఇచ్చారు.

● భువనేశ్వర్ - బెంగళూరు కంటోన్మెంట్ - బెంగళూరు టీవోడీ స్పెషల్‌కు అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో స్టాపేజీ కల్పించారు.

● సంబల్‌పూర్ - బెంగళూరు కంటోన్మెంట్ - సంబల్‌పూర్ టీవోడీ స్పెషల్స్‌కి కూడా అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో హాల్టింగ్ సదుపాయాన్ని కల్పించారు.

● కటక్ - బెంగళూరు కంటోన్మెంట్ - కటక్ టీవోడీ స్పెషల్స్‌కి అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో నిలుపుదల కల్పించారు.

బియ్యం వ్యాపారిపై దోపిడీకి యత్నం

తెనాలి క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బియ్యం వ్యాపారిపై తెనాలి రైల్వేస్టేషన్ వద్ద దోపిడీ యత్నం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. రేపల్లెకు చెందిన బియ్యం వ్యాపారి ఎస్.శివ రోజు వ్యాపారం నిమిత్తం రేపల్లె నుంచి తెనాలి వస్తుంటాడు. మంగళవారం ఉదయం ఒకటవ ప్లాట్ ఫాం చివరి నుంచి అతను బయటకు వస్తుండగా ఓ యువకుడు అడ్డగించాడు. తను ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌నని బ్యాగ్‌లో ఏముందో చూపించాలంటూ దబాయించాడు. దీంతో గుర్తింపు కార్డు చూపించాలని వ్యాపారి అడుగగా బ్యాగు లాక్కెళ్లడానికి దుండగుడు యత్నించాడు. ఇంతలో ఇతర ప్రయాణికులు అక్కడికి చేరడంతో ఆ యువకుడు బ్యాగు వదిలి అప్పటికే సిద్ధంగా ఇద్దరు యువకులతో ఉన్న బైక్ ఎక్కి పరారయ్యాడు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఇలాంటి ఘటనలు పరిపాటిగా మారాయి. సరైన పోలీసు నిఘా లోపించడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

44,948 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 46,472 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,948 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,358 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	15000
నెంబరు. 5	10000	14500
273	----	----
341	10000	16000
4884	----	----
సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16000
దేవనూరు డీలక్స్	10000	15000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	12700
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	15200
నెంబరు. 5	10000	14300
273	----	----
341	10000	16300
4884	11000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15400
బ్యాడిగి	10000	15800
దేవనూరు డీలక్స్	10500	15200
తాలుకాయలు	5000	8000

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముప్పాళ్ళ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ ముప్పాళ్ళ ఫీడర్ మరమరమ్మతుల కారణంగా ఆ ఫీడర్ పరిదిలోని ముప్పాళ్ళ చాగంటివారిపాలెం గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని విద్యుత్ ఏఈ సుచరిత మంగళవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మద్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు మరో అవకాశం

సత్తెనపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గతంలో రెగ్యులర్ విధానంలో 10వ తరగతి పాత సిలబస్‌లో చదివి ఉత్తీర్ణులు కానీ వారు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం గొప్ప అవకాశం కల్పిస్తుదని ఎంఈవో శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గతంలో ఉత్తీర్ణులు కాక పోయి 2025 మార్చిలో పరీక్షలకు హాజరైన విద్యార్థులను మాత్రమే సార్వత్రిక విద్యాపీఠం ద్వారా రెగ్యులర్ విధానంలో తప్పిన సబ్జెక్టులను మాత్రం 2026 మార్చిలో జరిగే పరీక్షల్లో రాసుకొని ఉత్తీర్ణత పొందవచ్చని ఆయన తెలిపారు. విద్యార్థులు ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో ఈనెల 8వ తేదీ లోపు రూ.300 రుసుం చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

మాచర్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం అసిస్ట్ - ఐటీసీ ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులు, సిబ్బందికి ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అసిస్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్ట్ ట్రైనర్ సీహెచ్ బోలయ్య, క్రోసూరు ఎంపీడీవో, ఈవో పీఆర్డీ, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● అచ్చంపేట మండలంలోని పెదపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంఈవో ప్రసాదరావు సందర్శించారు. నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

● మాచర్ల: పట్టణంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ సీఐ తురకా వెంకటరమణ పోలీసు సిబ్బంది, విద్యార్థులతో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.

● మాచర్లరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యాన మంగళవారం పట్టణంలోకి కేసీపీ క్యాంటిన్‌లో యువజన ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని పాఠశాలల విద్యార్థులకు వారం రోజులపాటు చెస్, డ్రాయింగ్, క్విజ్, క్లాసికల్, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ ఇక్కుర్తి శంకర్ తెలిపారు.

● మాచర్ల : సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన విశ్రాంత ఎంఈవో వేముల నాగయ్య ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.

● కారంపూడి మండలంలోని పేటసన్నిగండ్లలో హరిహరపుత్ర అయ్యప్పస్వామికి పడిపూజా మహోత్సవాన్ని నిర్వహించారు.

● సత్తెనపల్లి: మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, సచివాలయ ఉద్యోగులు మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించి సింగిల్ యూజ్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

● సత్తెనపల్లి : ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి సమయపాలన, క్రమశిక్షణ అలవర్చుకోవాలని పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని చైతన్య స్కూల్లో మంగళవారం యువత డ్రగ్స్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● క్రోసూరు: తుపాన్ ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రైతు బృందం మంగళవారం డిమాండ్ చేసింది. రైతు బృందం నాయకులు క్రోసూరు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

పెదకూరపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తనను కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు కూడా వేధిస్తున్నారని మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన షేక్ షాహీనా ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ గిరిబాబు మంగళవారం తెలిపారు. షాహీనా భర్త మహమ్మద్ కొంత కాలం బాగానే చూసుకున్నారని, తరువాత అత్తమామలతో కలసి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

పేదల ఆరోగ్యానికే కూటమి ప్రాధాన్యం

● 71 మందికి రూ.57 లక్షల చెక్కులు

పంపిణీ : ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్‌లను ఎమ్మెల్యే యరపతినేని అందజేశారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పేదల ఆరోగ్యానికి వేల రూపాయల లోపే సీఎం సహాయనిధి అందిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన పదిహేను నెలల కాలంలో గురజాల నియోజకవర్గంలో ఇప్పటికే 431 మందికి 4.37 కోట్ల రూపాయలకు పైగా సీఎం సహాయనిధి అందజేశారన్నారు. 1వ తేదీనే పింఛన్ల పంపిణీ.. అర్హత కలిగిన వారందరికీ స్మార్ట్ రేషన్‌కార్డులు కూడా అందించారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం భవన నిర్మాణం పూర్తయిందని, ఐలాండ్ సెంటర్లో ఫౌంటేన్ ఏర్పాటు పనులు మొదలయ్యాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, షేక్ బాబావలి, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, గండికోట వెంకటేశ్వర్లు, కొమ్మినేని రామచంద్రరావు, దియ్యా రామకృష్ణ, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, తురకా వీరస్వామి, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, చావా రామారావు, చింతపల్లి హసన్ అహ్మద్, చికెన్ బాషా, ఎల్‌వీఆర్, యడ్లపల్లి శివ, నారాయణ, ముప్పాళ్ల సాంబయ్య, ఉన్నం సురేష్, మేకల సాంబశివరావు, పావులూరి కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

వాడబలిజ సర్టిఫికెట్లను జారీ చేయాలి

● లోకేశ్‌ను కోరిన బాజీ చౌదరి

నకరికల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లో వాడబలిజ ధ్రువీకరణ పత్రాలను బీసీ(ఏ) క్యాటగిరి కింద జారీ చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలసి కోరినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి తెలిపారు. మంగళవారం ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలసి 2012 వరకు వాడ బలిజలుగా ఉన్న వారిని ఆ తరువాత రాజకీయ కారణాలతో ఓసీలుగా సర్టిఫికెట్లు జారీ చేస్తూ ఆ సామాజిక వర్గాన్ని విద్యా, ఉద్యోగ అవకాశాలకు దూరం చేశారని లోకేశ్‌కు వివరించినట్టు తెలిపారు. ఈ విషయమై లోకేశ్ కలెక్టర్ కృతిక శుక్లాతో మాట్లాడినట్టు వివరించారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా లోకేశ్‌కు విన్నవించినట్టు బాజీచౌదరి పేర్కొన్నారు. కుంకలగుంటలోని అన్ని మేజరు కాలువలకు లైనింగ్ పనులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరానన్నారు. కుంకలగుంట ఎర్ర, నల్ల చెరువు మరమ్మతుల కోసం కోటి రూపాయలు మంజూరు చేయాలని లోకేశ్‌కు ప్రతిపాదనలు అందజేసినట్టు తెలిపారు. కుంకలగుంట నుంచి జల్లాపేట గ్రామానికి, కుంకలగుంట శివారు పాపిశెట్టిపాలెంకు రహదారుల నిర్మాణం చేపట్టాలని, అందు కోసం పరిపాలనపరమైన ఆమోదం ఇవ్వాలని కోరానన్నారు. సమస్యలన్నింటిపై సానుకూలంగా స్పందించిన లోకేశ్ ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారని బాజీచౌదరి తెలిపారు.



మంత్రి లోకేశ్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేస్తున్న బాజీచౌదరి

ధ్రువీకరణ పత్రాల జారీపై ఆర్డీవో ఆరా

నకరికల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లో వాడబలిజ ధ్రువీకరణ పత్రాలజారీ విషయంపై ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి ఆరా తీశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కే పుల్లారావుతో ఈ విషయంపై ఆర్డీవో మాట్లాడారు. 1978 నుంచి 2012 సంవత్సరం వరకు వాడబలిజ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయని ఆర్డీవోకు తహసీల్దార్ వివరించారు. ఆ తరువాత కొన్ని రాజకీయ కారణాలతో నిలిపి వేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న సమస్యలు, సమస్యలపై తీసుకున్న చర్యల గురించి తహసీల్దార్‌తో, రెవెన్యూ ఉద్యోగులతో సమీక్ష జరిపారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని చేజర్ల కపోతేశ్వరాలయంలో క్యూలైన్‌లు ఏర్పాటు చేయా లన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్తీక పౌర్ణమి రోజు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీ తక్కెళ్ళపాడు గ్రామ అధ్యక్షుడిగా సోము ప్రసాదు

దాచేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం తక్కెళ్ళపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా సోముప్రసాదును నియమించారు. ఈ మేరకు మంగళవారం దాచేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి నారాయణ నియామకపత్రాన్ని ప్రసాదుకు అందజేశారు. ప్రసాదు మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆశీస్సులతో పదవీ బాధ్యతలు చేపడుతున్నానని, గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు. గ్రామ ఉపాధ్యక్షుడిగా గాలం వెంకటేష్‌ను నియమించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ పగడాల భాస్కరరావు, మామిడి చంద్రశేఖరరావు, బండి శ్రీనివాసరావు, జంగిలి వెంకట్రామయ్య, శ్రీరామదాసు అంజి, పిన్నబోయిన కోటయ్య, గాలం కాశయ్య, తేలుకుట్ల నాగేశ్వరరావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.



సోము ప్రసాదుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న బొమ్మిరెడ్డి నారాయణ తదితరులు

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

క్రోసూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థి బీ జగదీష్‌రామ్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ సూజన్ తెలియజేశారు. ఈ విద్యార్థి 7వ తేదీన జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున ఆడతాడని ఆమె చెప్పారు. ఆంధ్రా అసోసియేషన్ సబ్ జూనియర్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో జగదీష్ విశేష ప్రతిభ కనబరచటం పాఠశాలకు గర్వకారణమన్నారు. క్రీడాకారుడిని పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ వారు తదితరులు అభినందించారు.

పరస్పరం హత్యాయత్నం.. కేసులు నమోదు

క్రోసూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు యువకులు ఊటుగా మద్యం తాగి ఆ సీసాలను పగల గొట్టి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటన క్రోసూరు మార్కెట్ యార్డు సమీపంలోని వెంకటేశ్వర వైన్స్ షాపు వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం క్రోసూరు ఎస్సీ కాలనీకి చెందిన చిలకా రవి కుమార్, చిలకా కోటేశ్వరరావు, మరి కొందరు కలసి మద్యం షాపు వద్దకు వెళ్లి ఊటుగా తాగారు. తరువాత రవికుమార్, కోటేశ్వరరావులు ఇద్దరు ఘర్షణ పడ్డారు. మద్యం సీసాలను పగల గొట్టి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని పొడుచుకున్నారు. వీరిలో చిలకా రవికుమార్‌పై క్రోసూరు పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే రౌడీ షీటు ఉంది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్టు పోలీసులు తెలియజేశారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవటంతో ఇద్దరిపైన హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు తెలియజేశారు. క్రోసూరు ఎస్ఐ పీ రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెర సంఘీయుల అభ్యున్నతిపై మంత్రితో చర్చ



వడ్డెర సంఘీయుల సమావేశంలో పాల్గొన్న దుర్గారావు

మాచర్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గొల్లపూడి బీసీ భవనంలో మంగళవారం నిర్వహించిన వడ్డెర సంఘీయుల సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ మాచర్ల పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు పాల్గొన్నారు. మంత్రి సవితమ్మతో కలిసి వడ్డెరల అభ్యున్నతిపై చర్చించారు.

వీఆర్వోకు ఉత్తమసేవా పురస్కారం



కలెక్టర్ కృతికా శుక్ల నుంచి అవార్డును అందుకున్న వీఆర్వో దాసు

ముప్పాళ్ళ నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను సమయంలో సేవలందిచిన గోళ్ళపాడు వీఆర్వో బోరుపోతు దాసు ఉత్తమ వీఆర్వోగా ఎంపికయ్యి సోమవారం కలెక్టర్ కృతికా శుక్ల నుంచి అవార్డును అందుకున్నారు. అధిక వర్షాలకు గ్రామంలోని ఎస్టీ కాలనీలోకి నీరు వచ్చింది. సకాలంలో స్పందించి వీఆర్వోకాలనీ వాసులను పునరావాస కేంద్రానికి తరలించడం వారికి బోజన సదుపాయం వంటివి కల్పించడం చేశారు. ఉత్తమ సేవా అవార్డును అందుకున్న దాసును మంగళవారం తహసీల్దార్ నగేష్, కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు అబినందించారు.

రైతు మిత్ర గ్రూపులకు డ్రోన్ స్ప్రేయర్ అందజేత

దుర్గి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో మంగళవారం మండలంలోని ముటుకూరు, ఓబులేశునిపల్లె గ్రామాలకు చెందిన రైతు మిత్ర గ్రూపులకు ఏవో అమీర్‌రెడ్డి, యూనియన్ బ్యాంకు మేనేజర్ అమరలింగేశ్వరరావులు డ్రోన్ స్ప్రేయర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్ స్ప్రేయర్‌ను 80శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు.

న్యూచిట్యాల ఆర్అండ్ఆర్ సెంటర్లో శ్రమదానం

బెల్లంకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో న్యూచిట్యాల ఆర్అండ్ఆర్ సెంటర్లో ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శ్రమదానం, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజున రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళ కంపను తొలగించటం, పునరావాసకేంద్రంలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. పెదకూరపాడు ఎస్టీ సెల్ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు హనుమంత రావునాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎస్టీయూ ఏపీ నూతన కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలశాఖ ఎస్టీయూ ఏపీ నూతన కౌన్సిల్ సమావేశం ఉపాధ్యాయుడు బత్తుల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. మంగళవారం జరిగిన నూతన కార్యవర్గంలో ఎస్టీయూ ఏపీ మండల అధ్యక్షుడు గంధం గంగయ్య, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల అనీల్‌లను ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. పరిశీలకుడిగా రవికాంత్‌రెడ్డి వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులను అబినందించారు.

రేపటి నుంచి గ్రామసభలు

మాచర్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలో ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించనున్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : సీఐ

మాచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పట్టణ సీఐ తురకా వెంకటరమణ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థి రాచమంటి రాకేష్ రణధీర్ యాదవ్ ఇటీవల మంగళగిరి నియోజకవర్గంలోని రేవేంద్రపాడులో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అండర్ - 19 విభాగంలో తృతీయస్థానం సాధించాడు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో విద్యార్థి రాకేష్ రణధీర్ యాదవ్ అభినందన సభ నిర్వహించారు.

బ్యాంకు లింకేజీలు, గ్రౌండింగ్‌ల పై అవగాహన

పెదకూరపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో నియోజకవర్గంలోని ఏపీఎంలు, సీసీలు, ఎల్‌సీ శ్రీనిధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు లింకేజీ, ఏసీఎల్‌పీ గ్రౌండ్ ప్రాజెక్టుల గురించి డీపీఎం శ్రీనివాసరావు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీఎం చింతా జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు-ఏ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల కమిటీ

పిడుగురాళ్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో మంగళవారం పల్నాడు-ఏ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా ఇమ్మానియేలు రాజు, గౌరవ అధ్యక్షుడిగా దానియేలు, ప్రధాన కార్యదర్శిగా ఎం మోహనకుమారి, కోశాధికారిగా జ్ఞానరత్నం, మహిళా కార్యదర్శిగా ఎన్ఎస్ఎల్ కాత్యాయనీని ఎన్నుకున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వెల్దుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎస్‌కే నజీర్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపాడులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్‌తో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు.

వీరారాధన ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

కారంపూడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వీరారాధన ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం కూటమి నేతలు, అధికారులు పరిశీలించారు. ముందుగా వీరుల దేవాలయానికి చేరుకొని యుద్ధ భూమిని జేసీబీతో శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని 14 జిల్లాలతోపాటు బెంగళూరు, చెన్నై నుంచి కూడా వీరాచారవంతులు తమ పూర్వీకుల ఆయుధాలతో తరలివస్తారని, వారందరికీ వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, బొల్నేడి కోటేశ్వరరావు, పలిశెట్టి రాఘవ, బొమ్మిన శేషగిరిరావు, తోట రంగారావు, జక్కా నరసింహారావు, కాల్వ పేరయ్య, శెట్టి హనుమంతురావు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

హార్మోనుల సమతుల్యత లోపంతో వంధత్వ సమస్యలు

● డాక్టర్ నాగప్రత్యూష

అచ్చంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో వచ్చే వందత్వ సమస్యలకు ప్రధానంగా హార్మోనుల సమతుల్యత లోపమేనని గుంటూరు కిమ్స్ ఆస్పత్రికి చెందిన పెర్టిలిటీ ఐవీఎఫ్ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ నాగప్రత్యూష అన్నారు. మంగళవారం అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ జీ శిరీష, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాంబాబునాయక్, ఏఎన్ ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సైన్స్ డ్రామా పోటీల్లో గిరిజన ఆశ్రమ విద్యార్థినుల ప్రతిభ

విజయపురిసౌత్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని శంకర్ భారతిపురం జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన సైన్స్ డ్రామా కాంపిటేషన్స్‌లో మాచర్ల మండలంలోని ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. 8, 9 తరగతులకు చెందిన విద్యార్థినులు ఈ పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి నేషనల్ సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థినులుతోపాటు గైడ్ టీచర్ సుజాతను డీటీడబ్ల్యూవో అమరసుబ్బయ్య, హెచ్ఎం దుర్గాభవాని, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, వార్డెన్ పాల్గొన్నారు.

కార్తీకపౌర్ణమికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

● ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేటి కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సత్రశాల శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం, ఎండోమెంట్, పోలీసు, రెవెన్యూ తదితర అధికారులతో ఫోన్లో ఏర్పాట్లపై సూచనలు చేశారు.

● పిడుగురాళ్ల: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శైవక్షేత్రాలైన దైద అమరలింగేశ్వరస్వామి దేవాలయం, గుత్తికొండ బిలంలో భక్తులకు సౌకర్యాలు సమకూర్చాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆలయ కమిటీకి సూచించారు.

● అమరావతి: కార్తీకపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొనన్నున్నారు.

రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత

క్రోసూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో కొన్ని నెలల క్రితం మరణించిన టీడీపీ సీనియర్ కార్యకర్త చావల ప్రభుదాసు కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును మంగళవారం పార్టీ నాయకులు అందజేశారు. ప్రభుదాసు భార్య సరోజినికి చెక్కును అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ సీనియర్ టీడీపీ కార్యకర్తగా ఉన్న ప్రభుదాసు అకాల మరణం పార్టీకి తీరని లోటు అని ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, ఊరే రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కొరత ఉన్నా.. కోరుకున్న డిప్యూటేషన్


గుంటూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయం

● జిల్లా కార్యాలయాల్లో పాతుకుపోతున్న ఉపాధ్యాయులు

● పల్నాడు జిల్లా నుంచి సిఫార్సు డిప్యూటేషన్లు
● పథకాలు అమలులో కాసుల వేట!
● పాఠశాలల్లో టీచర్ల కొరత ఉన్నా బేఖాతర్

గుంటూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పటి దాకా బుద్ధిగా పాఠశాలలో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు స్థానం మారగానే అధికారి హోదాతో చెలరేగిపోతారు....పేద విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు డిప్యూటేషన్లపై మోజుతో సమగ్రశిక్ష, ఎంఈవో కార్యాలయాల్లో లేని అధికారాలు చెలాయిస్తున్నారు. ఒక్కో డిప్యూటేషన్‌కు లక్షలు ఖర్చుచేసి ఏళ్ళతరబడి ఇక్కడే పాతుకుపోతున్నారు. కొంతమంది పనిలేకున్నా కంప్యూటర్ వర్కు పేరుతో సమగ్రశిక్ష, ఎంఈవో కార్యాలయంలో కాలం వెళ్ళదీస్తున్నారు. మరీ విచిత్రం ఏమిటంటే వెనుకబడిన ప్రాంతమైన పల్నాడు జిల్లా నుంచి సైతం డిప్యూటేషన్ పేరుతో సమగ్రశిక్ష కార్యాలయంలో ఏళ్ళతరబడి పాతుకుపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పనిలో పనిగా కొన్ని పథకాల అమలులో భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

అక్కడ జీతం.....ఇక్కడ పని

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే కొన్ని పథకాలను విద్యాశాఖతో సమన్వయం చేసు కుని సమగ్రశిక్ష పనిచేస్తుంది. ప్రధానంగా నూతన పాఠశాల భవనాల నిర్మాణం, ప్రత్యేక అవసరాల విద్య, ఐఈడీ కేంద్రాల నిర్వహణ, నాడు నేడు పనుల పర్యవేక్షణ, బాలకార్మికుల్ని గుర్తించి బడుల్లో చేర్పించడం తదితర ప్రధాన విధులు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆయా పనులు చేయడానికి విద్యాశాఖలో నాన్ టీచింగ్ సిబ్బందితో పనిచేయించవచ్చు. అయితే డిప్యూటేషన్ పేరుతో ఉపాధ్యాయులు ఇక్కడ చేరి హల్‌చల్ చేస్తున్నారు.

సమగ్రశిక్షలో పనిచేసేందుకు ఓ టీచర్ బొల్లాపల్లి నుంచి ఓ ప్రజాప్రతినిధి నుంచి సిఫార్సు లేఖ తీసుకువచ్చి ఇక్కడ చేరిపో యారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో టీచర్స్ లేక అనేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం కిమ్మనకుండా డిప్యూటేషన్‌పై టీచర్లను ఇక్కడ నియిమించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని ప్రత్యేక అవసరాల విద్య విభాగంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక్కడ కొంత మంది దాదాపు పది సంవత్సరాల నుంచి పని చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక నాడు నేడు పనుల్ని పర్యవేక్షించడానికి కొంత మంది ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. రోజుకు గంటకు మించ కూడా ఇక్కడ పని ఉండదు. కార్యాలయంలో బయోమెట్రిక్, ముఖ హాజరు వేసి ఎంచక్కా సొంతపనుల్లో నిగ్నమౌతున్నారు.

సమగ్ర శిక్షలో పనిచేసే ఓ ఉపాధ్యాయులు రియల్ ఏస్టేట్, బినామీల పేరుతో అపార్టుమెంట్ కాంట్రాక్టు వర్కులు చేస్తున్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలోని ఎంఇవో కార్యాలయంలో కూడా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మండలస్థాయిలో కొంతమంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయుల జీతాలు బిల్లులు చేయడం, సర్వీసు మేటర్స్ సెటిల్ చేయడం వారి వద్ద నుంచి అందినకాడికి దండుకోవడం పనిగా పెట్టుకున్నారు. కొన్ని ఎంఇవో కార్యాలయంలో ఉపాధ్యాయులు సస్పెండ్ అయిన ఉపాధ్యాయుల మేటర్స్ సెటిల్ చేయడానికి దళారి పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు అన్ని ఎంఈవో కార్యాలయాల్లో ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని సమగ్రశిక్ష, ఎంఈవో కార్యాలయంలో దాదాపు వంద మంది వరకు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. పిల్లలకు పాఠాలు చెప్పాలని ప్రభుత్వం జీతాలు ఇస్తుంటే వక్రమార్గంలో డిప్యుటేషన్‌పై వచ్చికార్యాలయంలో పాతుకు పోతున్నారు. దీనివల్ల అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత నెలకొందని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టినా ఇంకా ఉపాధ్యాయుల కొరత ఉందంటే దానికి ప్రధాన కారణం డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులు పనిచేస్తూ పాఠాలలకు డుమ్మా కొట్టడమే కారణమని సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

సముద్ర స్నానాలు నిషేధం

బాపట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తిక మాసం పౌర్ణమి రోజు బుధవారం సూర్యలంక సముద్ర తీరంలో భక్తుల పుణ్య స్నానాల ఆచరణకు బ్రేక్ పడింది. సూర్యలంకతో పాటు పాండురంగాపురం, రామచంద్రాపురం, వాడరేవు, రామాపురం బీచ్‌ల్లో సముద్ర స్నానాలను అధికారులు పూర్తిగా నిషేధించారు. కార్తిక పౌర్ణమికి సూర్యలంకలో సముద్ర స్నానానికి భక్తులను అనుమతించాలని ముందుగా అధికారులు భావించి.. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడం.. మంగళవారం భారీ వర్షం కురవడంతో.. కార్తీక పౌర్ణమి రోజు కూడా భక్తులకు, పర్యాటకులకు ప్రవేశం లేదని ఆర్డీవో పి. గ్లోరియా ప్రకటన విడుదల చేశారు. మళ్లీ తీరానికి అనుమతి ఎప్పటి నుంచి అనేది ప్రకటించే వరకు సూర్యలంక తీరానికి రాకూడదని ప్రకటించారు. ఏ ఒక్కర్నీ సముద్రం వైపు రాకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.


మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక గదులు

తీరంలో వెలగని కార్తిక దీపం

మొంథా తుఫాన్ ప్రభావంతో గత నెల 22న నుంచి బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి పర్యాటకుల ప్రవేశాన్ని అధికారులు నిలిపివేశారు. తుఫాన్ కారణంగా సముద్రంలో అనేకచోట్ల గుంతలు ఏర్పడటంతో.. ప్రమాదాలు పొంచి ఉన్నాయని గ్రహించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సూర్యలంక ప్రధాన రహదారికి అడ్డుగా బారికేడ్‌లు ఏర్పాటు చేసి రాకపోకలను పూర్తిగా నిషేధించారు. కార్తిక మాసం రెండో సోమవారం సూర్యలకలో ప్రవేశం ఉంటుందని భక్తులు భావించారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ముందుగా ఈ నెల 4వ తేదీ వరకు అనుమతి లేదని ప్రకటించారు. ఇప్పుడు పౌర్ణమి రోజు కూడా రాకపోకలకు పూర్తిగా నిషేధం విధించారు. ఏటా కార్తిక పౌర్ణమి రోజు లక్షలాది మంది భక్తులు తీరానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి పూజలు నిర్వహిస్తారు. బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తజనం విశేషంగా తరలి వస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటి వరకు తీరంలో కార్తిక దీపాలు వెలిగించ లేదు. పూజలు నిర్వహించ లేదు. సముద్రగర్భంలో ప్రమాదకరమైన గుంతలు ఏర్పడటం వల్లే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

ప్రజా దర్బార్‌లో వినతుల వెల్లువ

● తొలిసారిగా.. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ● రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు ● స్వయంగా అర్జీలను స్వీకరించిన మంత్రి నారా లోకేశ్


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్


ప్రజా దర్బార్‌లో దివ్యాంగురాలి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. 70వ రోజు ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్ ను కలిసి సమస్యలను విన్నవించేం దుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు, బాధితులు పెద్దఎత్తున తరలివ చ్చారు. లోకేశ్‌ను కలిసి తమ గోడు చెప్పుకునేందుకు ఎంతో ఓపిగ్గా వేచిఉన్నారు. ప్రతి ఒక్కరినీ మంత్రి లోకేశ్ ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి విజ్ఞప్తిని స్వయంగా పరిశీలించి, తక్షణ పరిష్కారం చేయగలిగిన సమస్యలకు సంబంధించి సిబ్బందికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీచేశారు. గత వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాలు, అక్రమాలను గురించి వివిధ జిల్లాలకు చెందిన బాధితులు అర్జీల రూపంలో మంత్రికి అందజేశారు. చివరి వ్యక్తిని కలిసే వరకు ప్రజా దర్బార్ కొనసాగింది. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్ సుమారు నాలుగు వేల మందిని కలిసి అర్జీలను స్వీకరించారు. కూటమి ప్రభు త్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, అందరికీ అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు వరద నీరు




తాడేపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజె క్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 27,586 క్యూ సెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుందగా తూర్పు డెల్టా కాలువకు 1,514 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ నీటి నిల్వ 310 టీఎంసీలు

విజయపురిసౌత్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 589.40 అడుగులు ఉంది. ఇది 310.25 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,495, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 44,095 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 44,095 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టెయిల్ పాండ్ రిజర్వాయర్‌కు 33211 క్యూసెక్కులు

రెంటచింతల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రిజర్వాయర్‌కు ఎగువనసాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 33,211 క్యూసెక్కుల నీరు వస్తోందని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజులు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 28344 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 4,395 క్యూసెక్కులు మొత్తంగా 32,739 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 74.95 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.7040 టీఎంసీలకు సమానమన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.545 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 64.6716 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందని తెలిపారు. 2026 మార్చి 31 నాటికి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 80 ఎంయూలన్నారు.


టెయిల్‌పాండ్ ప్రాజెక్ట్‌లో నీరు

జాడలేని ఆహార సలహా సంఘాలు

● సమీక్షలు నిర్వహించని అధికారులు ● ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు ● మూడు ఏళ్ల నుంచి కమిటీలకు మంగళం


తాడికొండలోని తహసీల్దార్ కార్యాలయం

తాడికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల నాణ్యత, ధరల నియంత్రణలో ప్రజలకు సేవలందించాల్సిన ఆహార సలహా సంఘాలు మచ్చు కైనా కన్పించడం లేదు. దీంతో ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడంతో పాటు ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. డివిజన్, మండల స్థాయి కమిటీలు, జిల్లా స్థాయిలో సలహా సంఘాల కమిటీలను కలెక్టర్లు లీడ్ చేస్తుంటారు. ఈ కమిటీలో కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారుల, ప్రజా ప్రతినిధులు కూడా ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దారు, ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లు, ప్రజా సంఘాలు కమిటీలో ఉంటారు. తహసీల్దార్ ఈ కమిటీని లీడ్ చేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జిల్లా పౌరసరఫరా శాఖ నిబంధనల మేరకు మండల స్థాయి కమిటీలను నియమిస్తారు.

తూతూ మంత్రంగా సమావేశాలు

గత ప్రభుత్వ హయాంలో మండల స్థాయిలో ఆహార సలహా సంఘాలు కనిపించకుండా పోయా యి. మూడేళ్ల నుంచి ఒక్క సమావేశం కూడా జరగ లేదు. అంతకముందూ తూతూ మంత్రంగా కానిచ్చే వారు. వాస్తవానికి మూడు నెలలకోసారి మండల స్థాయి సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాలను డివిజన్ స్థాయిలో కమిటీకి తెలపాలి. డివిజన్ సంఘాలు జిల్లా కమిటీలకు నివేదికను పంపించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి కంటితుడుపు చర్యలుగా సమావే శాలను అధికారులు నిర్వహించేవారు. అధికారులు ఆహార సలహా సంఘాల సమావేశాలు నిర్వహిం చాలని వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు కోరుకుంటున్నాయి.

● సలహా సంఘాల విధులు

- కమిటీ సభ్యుల దృష్టికి వచ్చిన ఆహారం పదా ర్థాల శుభ్రత, నాణ్యత, ధరల నియంత్రణ లేకపోవడం, అధిక ధరలకు విక్రయించడం వంటి వాటిని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాలి.
- ఈ నివేదికలు జిల్లా అధికారులకు అందగానే సరైన నిర్ణయం తీసుకుని అమలు చేయడం, ధరల నియంత్రణ అడ్డుకట్ట వేయడం వంటివి చేయాలి.
- ఆహార సలహా సంఘాలు వైఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి కొనసాగాయి. అనంతరం టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని కొసాగించింది.
- వైసీపీ ప్రభుత్వంలో సలహాల సంఘాల ఊసే లేకుండా పోయింది. కొత్త ఏర్పటైన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలోనైన ఆహార సలహా సం ఘాల కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చే యాల్సిన అవశ్యకత ఉంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆహార భద్రత విషయంలో ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షించాలి

చింతల భాస్కరరావు, ఆహార సలహా సంఘం కమిటీ సభ్యుడు, తాడికొండ



అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దుకాణాల్లో సరుకుల నాణ్యతను పరిశీలించాల్సి ఉంది. కల్తీ సరుకులపై అధికారులు దృష్టి పెట్టాలి. ఆహార సలహా సంఘాల సమావేశాలను ఏప్పటికప్పుడు అధికారులు నిర్వహించాలి. వినియోగదారులకు అందుబాటులోకి ధరలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

దేవదాయశాఖ అలర్ట్

● నేడు కార్తిక పౌర్ణమి
● కాశీబుగ్గలో ఘటనతో శైవక్షేత్రాల్లో ముందస్తు జాగ్రత్తలు

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమి పూజలు బుధవారం అన్ని శైవక్షేత్రాల్లో వైభవంగా జరగనున్నాయి. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తిక మాస పౌర్ణమి పూజలకు భక్తుల రద్దీ దృష్ట్యా దేవదాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. అయితే శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘటనతో అధికారులు మరింత అలర్ట్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు దేవదాయ శాఖ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు శైవక్షేత్రాలను దర్శించి.. ఈవోలు తీసుకుంటున్న భద్రత చర్యలను పరిశీలించారు. దర్శనం సమయంలో, దీపారాధనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పెదకాకాని మల్లేశ్వరస్వామి, అమరావతిలోని అమరేశ్వరస్వామి, గోవాడ బాలకోటేశ్వరస్వామి, కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి, ధైదలోని అమరలింగేశ్వర స్వామి, కొత్తపేటలోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానాలతో పాటు పలు ఆలయాల్లో కార్తిక దీపారాధనలకు పెద్దఎత్తున భక్తులు తరలిరాను న్నారు. కోటప్పకొండ, పెదకాకాని, అమరావతి ఆల యాలకే.. 50వేల మందికి పైగా భక్తులు రానున్నా రనే అంచనాతో ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారులు మైకుల ద్వారా నిరంతరం భక్తుల మార్గనిర్దేశ నం చేయనున్నారు. అలయాల్లో బారికేడ్లు, క్యూలైన్లు, ఇతర మార్గాలను ఉన్నతాధికారులకు తెలియకుండా మార్చకూడదని, అత్యవసర, బయటకు వెళ్లే మార్గాల్లో భక్తులను అడ్డుకోకూడదని కమిషనర్ ఆలయాల ఈఓలకు స్పష్టం చేశారు. క్యూలైన్లలో భక్తులు వ్యతిరేక దిశలో ప్రవేశించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆలయాల్లో భక్తులు సంయమనంతో ఉండాలని, పరుగులు తీయడం, తోపలాటలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గుంపులు గుంపులుగా గుమికూడరాదని, ఆలయ సిబ్బంది సూచనల మేరకు నడుచుకోవాలని సూచించారు.

డాక్టర్ ఇంటిలో భారీ చోరీ

● రూ. 60లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

తెనాలి, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలోని ఒక ప్రముఖ వైద్యుని ఇం టిలో జరిగిన భారీ దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న హాస్పిటల్ పైఅంతస్తులో డాక్టర్ దంపతుల కుటుంబం నివాసం ఉంటోంది. వారి ఇంటిలో దాచిన నగదు గతంలో పలుమార్లు మాయం కావడంతో స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. అక్కడ పనిచేవారిలో ఎవరైనా చేసి ఉంటా రని అనుమానించారు. ఆ వివరాలనే ఫిర్యాదులో పేర్కొన్నారు. అ యితే ఆ దొంగతనాల గుట్టు తేలకముందే తాజాగా పెద్ద మొత్తంలో బంగారం దొంగతనం జరగడం సంచలనం కలిగించింది. రూ.60 లక్షల విలువైన బంగారు బిస్కెట్లు మాయమైనట్టు గుర్తించిన డాక్టర్ మంగళవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఈ వరుస దొంగతనాల వెనుక ఇంటి దొంగల పని అయి ఉంటుందన్న అను మానం ఒక కోణంలో, పనిచేస్తున్న వ్యక్తులపై అనుమానంతో మరో కోణంలో విచారణ చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. దీనిపై డీఎస్పీ జనార్దనరావును వివరణ కోరితే ఫిర్యాదు అందినమాట వాస్తవమేనని, విచారణ జరుపుతున్నామని, త్వరలో దొంగలను గుర్తిస్తామని పేర్కొన్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి ఎవరి పేర్లూ పోలీసులు వెల్లడించ లేదు. కేసు నమోదు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ వివరించారు.


పుల్లడిగుంట పొలాల్లో విరబూసిన ముద్దబంతిపూలు

బంతిపూల సోయగం

ఇక్కడ కనిపిస్తున్న తోట అరకు వ్యాలీలోని వలిసి పూల తోట అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇవి గుంటూరు రూరల్ మండల పరిధిలోని పుల్లడిగుంట పొలాల్లో విరబూసిన ముద్దబంతి పూలతోటలు. కార్తీకమాసం పూజల్లో విస్తృతంగా ఉపయోగించే ముద్దబంతిపూలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. దీంతో రైతులు విస్తారంగా సాగుచేశారు. వందల ఎకరాల్లో విస్తరించిన ఈ ముద్దబంతి పూలతోటలు అరకు వ్యాలీని తలపించేలా ఉన్నాయి. గుంటూరు నుంచి పర్చూరు, పాత మద్రాసు రోడ్డులో ప్రయాణించే వారికి ఈ పూల తోటలు కనువిందు చేస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)


రోడ్డుపై పూలు విక్రయిస్తున్న రైతులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రభుత్వ వైద్యశాలలో డీసీహెచ్‌ఎస్ విచారణ

వినుకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పల్నాడు జిల్లా డీసీహెచ్‌ఎస్ ప్రసూన మంగళవారం విచారణ చేపట్టారు. ఆసుపత్రిలోని పలువురు మహిళా డాక్టర్లు సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డిపై ఇటీవల పలు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆసుపత్రిలో సిబ్బందిని, డాక్టర్లను ఆమె విచారించారు. ఆరోపణల వివరాలను తెలియజెప్పేందుకు డీసీహెచ్‌ఎస్ నిరాకరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

యడ్లపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం వంకాయలపాడు శివారులో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి సుమారు 12.30గంటల సమయంలో వంకాయలపాడు శివారులో పేకాడుతున్నారన్న సమాచారం రావటంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.15,300ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారందరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

● నూజెండ్ల: మండలంలోని మేకపాడు పొలాల్లో పేకాట శిబిరంపై ఐనవోలు ఎస్ఐ టీవీ కృష్ణారావు మంగళవారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.50,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ట్రైనింగ్ ఎస్ఐ పీ నరేష్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

8న మెగా కంటి వైద్యశిబిరం

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కోడెల శివప్రసాదరావు ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని మందాడి రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజా గారి కోటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆసుపత్రి సముదాయంలో ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు.

రేపటి నుంచి మగ్గం వర్క్ కోర్సులో శిక్షణ

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి మగ్గం వర్క్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని సంస్థ డైరెక్టర్ ఎస్.నోలోఫర్ మంగళవారం తెలిపారు. నరసరావుపేట మండలం రావిపాడులోని శిక్షణ సంస్థ కార్యాలయంలో 30రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు భోజన వసతి కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి చదవటం, రాయటం వచ్చిన పల్నాడు జిల్లా మహిళలు, పురుషులు అర్హులన్నారు. అదనపు సమాచారం కోసం రావిపాడులోని ఎన్‌టీఆర్ విగ్రహం సమీపంలో ఉన్న సంస్థ కార్యాలయంలో 08647-221916, 9703120524, 6300466010 నంబర్లను సంప్రదించాలన్నారు.

కనీస మద్దతు ధర పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి కనీస మద్దతు ధర పోస్టర్‌ను నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. 2025-26 సీజన్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.8,110 కనీస మద్దతు ధర ప్రకటించడం ద్వారా రైతులకు భారీ ఊరట లభిస్తుందన్నారు. ఇది గత సీజన్‌తో పోలిస్తే సగటున 12 నుంచి 15 శాతం పెంపు ఉందన్నారు. ప్రతి సీజన్‌లో ఖరీఫ్, రబీ పంటలకు ఎంఎస్‌పీ ప్రకటించడం వల్ల రైతులు మార్కెట్ ధరల పతనం నుంచి రక్షణ పొందుతారన్నారు నూనె గింజలు, పప్పు ధాన్యాలు, పోషక తృణధాన్యాల సాగును ప్రోత్సహించేలా ధరలు నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మొండితోట రామారావు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● వినుకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ఉపసంహరించాలని, పెండింగ్‌లో ఉన్న ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ఏవోఐ) వినుకొండ బ్రాంచ్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తెలంగాణలోని ఖమ్మంలో జరుగుతున్న ఎల్ఐసీ ఏవోఐ సౌత్ సెంట్రల్ జోన్ ఆరో మహాసభలను జయప్రదం చేయాలని మంగళవారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

● వినుకొండ టౌన్: మండలంలోని నరగాయపాలెంలో ఐటీసీ బైఫ్ అధ్వర్యంలో పశువైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ మండలం పశువైద్య అధికారి డాక్టర్ పి.అమీర్‌బాషా 34 గేదేలకు గర్భకోశ, చూడి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

● నరసరావుపేట టౌన్: కృష్ణా జిల్లా విజయవాడలో నిర్వహించిన 24వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2025 పోటీలలో కే-రిడ్జి ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జీ బరబాస్ మంగళవారం తెలిపారు. విజయవాడ రైల్వే ఇనిస్టిట్యూట్ వేగస్ వర్క్ షాప్ కాలనీలో కరాటే పోటీలు నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్: కార్తీక మాసం కావడంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పట్టణ నడిబొడ్డున ఉన్న శివుడి బొమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివశక్తి ఫౌండేషన్‌తో ఎస్సీ, ఎస్టీలకు తోడ్పాటునందిస్తాం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



తుఫాను సమయంలో సమర్థవంతంగా పనిచేసిన డ్వామా పీడీ లింగమూర్తి, వినుకొండ తహసీల్దార్ సురేష్, నూజెండ్ల తహసీల్దార్ ఉమాదేవిని అభినందిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శివశక్తి ఫౌండేషన్‌తో ఎస్సీ, ఎస్టీలకు సాయమందిస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు భరోసా ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, పశుసంవర్ధక శాఖ, మండల ప్రజాపరిషత్, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ అందరి సహకారంతో మొంథా తుఫాను నుంచి ప్రాణ, ఆర్థిక నష్టాన్ని నివారించగలిగామని, సమన్వయంతో పనిచేసిన అధికారులందరికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు సూర్యఘర్ పథకాన్ని రాష్ట్రంలోనే టాప్-10లో ఉంచాలని, ప్రతిఇంటిపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేలా అధికారులు వినియోగదారులను ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 10వ తేదీన సోలార్ ప్యానల్ ఏర్పాటుకు రుణమేళా కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా మీటర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును భరిస్తుందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో 15వేల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు పండించేందుకు వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు కృషి చేయాలన్నారు. అత్యధికంగా పంటలు వేయించిన అధికారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పాస్‌బుక్‌లు, ఆన్‌లైన్ సమస్యలను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు లేని ప్రతి పేదవాడి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో బాగా పనిచేసిన అధికారులకు ఈ సందర్భంగా ఆయన సన్మానించారు. డ్వామా పీడీ లింగమూర్తి, వినుకొండ తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో పీ ఉమాదేవిని తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలను పరిశీలించిన జీవీ

వినుకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ పరిధిలోని విష్ణుకుండినగర్ సమీపంలోని సాయినగర్‌లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్థానికుల అభ్యర్థన మేరకు మంగళవారం పర్యటించారు. ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల యజమానులకు నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకునేందుకు నోటీసులు అందజేయాలని జీవీ ఆంజనేయులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విష్ణుకుండినగర్ సమీపంలోని సాయినగర్‌లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్థానికుల అభ్యర్థన మేరకు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటి కారణంగా విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీనిపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఇటీవల స్థానికుడు కొండారెడ్డికి చెందిన ద్విచక్రవాహనంతో పాటు గద్దె వెంకట్రావు నివాస గృహంలో దొంగలు రూ.8లక్షల సొత్తును దోచుకున్నారని, చీకటి పడితే ఈ ప్రాంతంలో ఉండలేకపోతున్నామని స్థానికులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. వెంచర్లలో మందుబాబుల తాకిడి ఎక్కువయిందని స్థానికులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. స్పందించిన ఆయన పట్టణ సీఐ ప్రభాకర్‌తో పట్టణంలో గస్తీ ఏర్పాటుచేసి మందుబాబులను అదుపులోకి తీసుకొని తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు గంగినేని రాఘవ, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, రామారావు, కోటేశ్వరరావు, మహిళలు ఉన్నారు.



విష్ణుకుండినగర్ సమీపంలోని సాయినగర్‌లో సమస్యలను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ

చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థుల ప్రతిభ



శావల్యాపురం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం విజయలక్ష్మి

శావల్యాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శావల్యాపురం జడ్పీ పాఠశాల్లో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు మండల జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు మోహన్‌చంద్ తెలిపారు. మతుకుమల్లి, శావల్యాపురం, పోట్లూరు, వేల్పూరు జడ్పీ పాఠశాలలకు చెందిన నాలుగు టీంలు పోటీల్లో పాల్గొనగా వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు చెన్నా లోహిత, గోరింట్ల గాయత్రి, జూపల్లి విష్ణువర్ధన్‌లు ప్రథమస్థానంలో, మతుకుమల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు మణితేజ, కుసుమ, తేజస్వీ ద్వితీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ నెల 23న జరగనున్న జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు శావల్యాపురం మండలం తరపున పాల్గొంటారన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి బహుమతులు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక మండలాధ్యక్షుడు వసంతరావు, ప్రధాన కార్యదర్శి బోయపాటి త్రివిక్రమ్, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్మయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● ఈపూరు: మండల స్థాయి చెకుముకి పోటీలను ఈపూర్ హైస్కూల్లో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో కొండ్రముట్ల పాఠశాలకు చెందిన విద్యార్థుల గ్రూపు ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.



ఈపూరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

● బొల్లాపల్లి: మండలంలోని బొల్లాపల్లిలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన చెకుముకి పోటీల్లో వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైన్స్ పోటీల్లో మంగళవారం మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు చేతన్, సుమంత్ కుమార్, స్నేహ అంజలీలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి షీల్డ్ ప్రశంసా పత్రాలు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వెల్లటూరు జడ్పీ హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్యూలా హోసన్న, ఉపాధ్యాయులు చంద్రజిత్తు యాదవ్, గ్రామస్థులు అభినందించారు.

● వినుకొండ: చెకుముకి మండల స్థాయి ప్రతిభా పరీక్షలను మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గంలో మిగిలిన నాలుగు మండలాలలో కూడా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారని అధ్యక్షుడు కమలారామ్ తెలిపారు. వినుకొండ మండలంలోని 14 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దస్తగిరి సతీమణి, కౌన్సిలర్ షకీలా బేగం బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి పరీక్షలు నవంబరు 23వ తేదీన జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ కార్యదర్శి భాగవతుల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.నాగేశ్వరావు, జన విజ్ఞాన వేదిక కోశాధికారి రఘు మాస్టారు, జేవీవీ కార్యవర్గ సభ్యులు సాంబశివరావు, శేఖర్, రేణుక పాల్గొన్నారు.



వెల్లటూరు హైస్కూల్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం బ్యూలా హోసన్న

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వినుకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరం, గోకనకొండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి మాట్లాడుతూ వరిలో ఉల్లికోడు ఆశించిన పొలానికి ఎకరాకు కెరటాపు హైడ్రోక్లోరైడ్ (కెల్డాన్) గుళికలు 8 కిలోలు లేదా ఫోరట్ 4 కేజీలు నీరు తీసివేసి చల్లాలని లేదా కెల్డాన్ పొడి 400 గ్రాములు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్ రైతు సేవా కేంద్ర సిబ్బంది చాందిని పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో వరలక్ష్మి

బొప్పూడి, తాతపూడి గ్రామాలలో ...

చిలకలూరిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి, తాతపూడి గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత మాట్లాడుతూ మొంథా తుఫాన్ అనంతరం పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. త్వరలోనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నేపథ్యంలో అమ్ముకోదలచిన రైతులు తప్పనిసరిగా ఈ పంటలో నమోదు అయి ఉండాలని, వారి పట్టాదార్ పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు రైతు సేవ కేంద్ర సిబ్బందికి ఇచ్చి సంబంధిత యాప్‌లో నమోదు చేసుకొని, కప్పాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్ ప్రవీణ్, గ్రామ వ్యవసాయ సహాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

వెంగళరెడ్డి కాలనీవాసులకు తొలగిన నీటి సమస్య

చిలకలూరిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డు పరిధిలో ఉన్న వెంగళరెడ్డి కాలనీవాసులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు మున్సిపాలిటీ వారు చొరవ తీసుకొని ఆ కాలనీవాసులకు తాగునీటి సమస్య లేకుండా చేశారు. ముఖ్యంగా ప్రధాన నీటి పైపులైన్ నుంచి ఇంటర్ కనెక్షన్లను కలిపి ఆ ప్రాంతానికి నీటి సరఫరాను మెరుగుపరిచారు. మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని మంగళవారం కాలనీలో పర్యటించి ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.

క్విజ్, వక్తృత్వ పోటీల్లో ఉన్నవ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి క్విజ్, వక్తృత్వ పోటీలలో ఉన్నవ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం చిలకలూరిపేటలోని ఆర్‌వీఎస్ఎన్‌వీఎస్ హైస్కూల్‌లో జరిగిన నియోజకవర్గస్థాయి పోటీలను నిర్వహించారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన 12 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో ఉన్నవ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు డి.వేణుమాధవ్, బి.లిఖిత, సీహెచ్ బిందుశ్రీల టీం ప్రతిభను కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా వక్తృత్వ పోటీలో పదో తరగతి విద్యార్థిని బి.లిఖిత ద్వితీయ బహుమతిని సాధించింది. ఉపాధ్యాయురాలు గౌరిని, విద్యార్థులను హెచ్ఎం పుట్టా దుర్గ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

ప్రైవేట్ మెడికల్ కళాశాలలను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ

రొంపిచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపాలెంలో ప్రైవేట్ కళాశాలలను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లు మెడికల్ కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద వైద్య విద్యార్థుల కోసం కళాశాలలను ప్రారంభిస్తే కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: ప్రభుత్వ మెడికల్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కనమర్లపూడి, వేల్పూరు గ్రామాల్లో వైసీపీ నాయకులు మంగళవారం కోటి సంతకాల సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, సీనియర్ నేతలు తన్నీరు అంకారావు, బోడెపూడి శ్రీను, బొల్లా సుబ్బారావు, స్వర్ణాల వెంకట్రావు, తూమాటి కబ్బారావు, ముండ్రు రాఘవరావు, మారిశెట్టి శివరామ్ ప్రసాద్, మోషే పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న వంగవీటి రాధ

వినుకొండలో వంగవీటి రాధాకు అభిమానుల స్వాగతం

వినుకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకు వినుకొండ పట్టణంలో ఆయన అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఆయన శ్రీశైలం వెళ్లి తిరిగి విజయవాడ వెళ్తుండగా మార్గమధ్యంలో రాధా అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆయనను కలిసిన వారిలో గంధం కోటేశ్వరరావు, ఆర్.శ్రీను, కొప్పుకొండ సర్పంచ్ కోలా వీరాంజనేయులు, నర్రా చరణ్, నంది కొండలరావు, గంధం సుబ్బారావు, పొడుగు దుర్గా, బూదాల సాగర్, నరాల శ్రీను, బెల్లం శ్రీను, కారుపల్లి శ్రీను, బోస్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన కాపు నాయకులు, అభిమానులు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్, కబడ్డీ స్టేట్ మీట్‌కు వాగ్దేవి విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 16 కబడ్డీ ఈ నెల 2న, ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 19 హ్యాండ్ బాల్ జిల్లా సెలక్షన్‌లలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. కబడ్డీలో నక్క అనిల్ కుమార్, హ్యాండ్‌బాల్‌లో మారిశెట్టి అశ్విని, కోనంకి మణికంఠ, మూడావత్ దుర్గాప్రసాద్‌లు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 6న కర్నూలు జరగబోయే సబ్ జూనియర్ కబడ్డీ స్టేట్ మీట్, ప్రకాశం జిల్లాలో జరగబోయే హ్యాండ్ బాల్ స్టేట్‌మీట్‌కి ఎంపికైన విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు అభినందించారు.



ఖాళీగా ఉన్న సచివాలయ సిబ్బంది కుర్చీలు

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

● మొక్కుబడిగా విధుల నిర్వహణ

నరసరావుపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన సచివాలయ సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. నరసరావుపేట పట్టణంలోని పెద్దచెరువులోని 26వ వార్డులోని పెదచెరువు సచివాలయం-2లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. మరికొందరు సచివాలయంకు మొక్కుబడిగా వచ్చిపోతున్నారని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు 8మంది సిబ్బంది విధులకు హాజరు కావాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే విధులకు హాజరయ్యారు. దీంతో విద్యార్థులకు అవసరమైన పలురకాల ధ్రువీకరణ పత్రాలు, రైతులకు అవసరమైన 1బీ, అడంగల్ వంటి సేవలు సామాన్య ప్రజలకు అందడం లేదు. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు చేపట్టాలని వార్డు ప్రజలు కోరుకుంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



లక్ష్మి (పాత చిత్రం)

ఈపూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరులో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన మూడెం లక్ష్మి (38) గేదెలను మేత కోసం పొలం తోలుకువెళ్ళింది. అయితే సాయంత్రం గేదెలు ఇంటికి వచ్చినప్పటికీ వాటివెంట లక్ష్మి రాలేదు. లక్ష్మి బంధువులు పొలం వెళ్లి వెతికారు. ఆ సమయంలో లక్ష్మి పొలంలో చెరువుపక్కన చనిపోయి ఉంది. తొలత మధ్యాహ్నం పడిన వర్షం సమయంలో పిడుగులు పడి లక్ష్మి చనిపోయిందని భావించారు. అయితే వర్షం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పడగా లక్ష్మి నాలుగు గంటల సమయంలో చెరువు కట్టమీదగా ఇంటికి వెళ్తున్న వారిని సమయం ఎంత అయింది అని అడిగినట్లు తెలిసింది. దీంతో ఆ బంధువులు లక్ష్మిని పరిశీలించి మెడలో బంగారు గొలుసు ఉంటుందని అది కనిపించడం లేదని అనుమానం వ్యక్తం చేస్తూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మీ భర్త గోవిందు నాలుగు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎస్ఆర్‌కేటీ కాలనీలో గంజాయి సేవించి ఘర్షణ

నరసరావుపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కాలనీ ఎస్ఆర్‌కేటీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం కొందరు యువకులు గంజాయి సేవించి కాలనీ ప్రజలతో ఘర్షణకు దిగారు. కాలనీ ప్రజలు నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీసుల రాకతో యువకులు పరారయ్యారు. పట్టణ శివారు కాలనీలలో యువకులు నిత్యం గంజాయి సేవిస్తూ ఆయా కాలనీలలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నరసరావుపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్ సెంటరు వద్ద ఓ కిచిడి పాయింట్ పక్కన సందులో నిత్యం యువకులు గంజాయి సేవిస్తూ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు మొత్తం ఖాళీచేసి వేరే ప్రాంతాలకు వెళ్ళిపోయారంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థంచేసుకోవాలి. గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్ఆర్‌కేటీ కాలనీ సెంటరులో అర్ధరాత్రి వ్యాపారాలు

ఎస్ఆర్‌కేటీ కాలనీ బైపాస్ వద్ద రిలయన్స్ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న హోటల్‌లో రాత్రి సమయాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో తిరిగే యువకులు, చిల్లర దొంగతనాలు చేసే వారంతా అక్కడే కొంత సమయం గడుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నరసరావుపేట బైపాస్, రావిపాడు గ్రామం వద్ద రాత్రి సమయాల్లో హోటళ్లు నిర్వహించడంతో అసాంఘిక శక్తులు అక్కడకు చేరుతున్నాయి. పోలీసులు రాత్రి 10గంటల తర్వాత వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రెడ్డిపాలెం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవినాయక్

రొంపిచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రవినాయక్ మంగళవారం తెలిపారు. 10వ తరగతి చదువుతున్న రామిశెట్టి విష్ణుప్రియ, కొలికొండ ఝాన్సీరాణి నవంబరు 2వ తేదీన నరసరావుపేటలో జరిగిన ఎంపికలో ఇద్దరు ఎంపికయ్యారన్నారు. 35వ సబ్ జూనియర్ బాల బాలికల జట్టు ఎంపికలో ఎంపికై కర్నూలులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్ఎం రవినాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్మశానంలో వర్షపు నీరు తొలగింపు



ఆయిల్ ఇంజన్లతో శ్మశానంలోని వరద నీటిని బయటకు తోడిపోస్తున్న దృశ్యం

చిలకలూరిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నీరు నిలిచిన పట్టణంలోని ఏఎంజీకి సమీపంలోని శ్మశాన వాటికలో నీటిని మున్సిపల్ అధికారులు తొలగించారు. వారం రోజులుగా శ్మశానంలోని సమాధులు నీట మునిగే ఉండటంతో పరిస్థితిని స్థానికులు మంగళవారం మున్సిపల్ చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెండు రోజుల క్రితం శ్మశానంలోని నీటిని ఇంజన్లతో తోడి బయటకు పంపినప్పటికీ తిరిగి నిండానీరు చేరడంతో సమస్యను గుర్తించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ సత్వర చర్యలకు ఆదేశించారు. కమిషనర్ శ్రీహరిబాబు, డీఈ రహీంతో ఆయన మాట్లాడి అక్కడ నీటిని తోడి బయటకు పంపేందుకు ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేయించారు. వర్షం పడిన ప్రతిసారీ శ్మశానంలో నీరు నిలిచి నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక అంత్యక్రియలకు ఇబ్బంది కలుగుతున్న దృష్ట్యా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

చిత్రకారుడు ప్రసాద్‌కు ఘన సన్మానం

వినుకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినుకొండకు చెందిన జాతీయ చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాదుకు ఘన సన్మానం జరిగింది. గుంటూరు బృందావన గార్డెన్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నటనాలయం సంస్థ నిర్వాహకులు ప్రసాద్ ప్రతిభను గుర్తించి దుశ్శాలువా, పూలమాలలతో జ్ఞాపికను అందించి సత్కరించారు. ప్రసాద్‌ను పట్టణ ప్రముఖులు, తోటి కళాకారులు అభినందించారు.